క్లుప్తంగా

చెగువేరాకు నివాళి



చెగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పాడేరు రూరల్: మండల కేంద్రంలో గిరిజన సమాఖ్య, ఏబైవైఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో చెగువేరా జయంతిని బుధవారం నిర్వహించారు. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ చెగువేరా ఉద్యమ స్ఫూర్తి ఆశయాలు నేటి యువతకు ఎంతో అవసరమన్నారు. ఆయన జీవితం యువతకు ఆదర్శమన్నారు. నేతలు లక్ష్మణ్‌రావు, చంటిబాబు, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు



భరత్‌కుమార్‌నాయక్

అరకులోయ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులు, ఎన్‌సీసీ విద్యార్థులకు సంబంధిత కోటాలో ప్రవేశానికి అర్హులని, దరఖాస్తుతో ఆయా ధ్రువపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖపట్నంలోని కృష్ణా కళాశాలలో (ప్రభుత్వ డిగ్రీ కాలేజీ)లో దరఖాస్తుల, సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలిస్తారని చెప్పారు. జూలై 3న సీట్ల కేటాయింపు, 4వ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తామన్రాఉ. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాస్టర్లకు ఘన సన్మానం



పాస్టర్లను సన్మానిస్తున్న రాష్ట్ర పాస్టర్స్ వెల్ఫేర్ ప్రతినిధులు

అరకులోయ: అరకులోయ పరిధిలోని లూథరన్ మిషన్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్‌తో పాటు పలువురు పాస్టర్లను ఏపీ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు రవికిరణ్, అధ్యక్షుడు సుగుణరాజు, కార్యదర్శి ఎబినేజర్‌లు బుధవారం ఘనంగా సన్మానించారు.లోక కళ్యాణార్థం ఏసుక్రీస్తు ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కారుణ్య మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ దైవకృప, పాస్టర్లు సుబుబోస్, సదానందం, అబ్రహం, మదన్, శామ్యూల్, రత్నమణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి



ఐటీడీఏ ఏపీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాలైన పునరావాస కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానికులు ఐటీడీఏ ఏపీవో సీహెచ్.శ్రీనివాస్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాలనీలో బోరు ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాల కల్పించాలని కోరారు. కాలనీకు చెందిన పలువురు మహిళలు ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించారు. కొండ మెదలు సర్పంచ్ వెట్ల విజయ, గిరిజన సంఘం నాయకులు జోగారావు, బుల్లబ్బాయి, శ్రీరాములు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

అరకులోయ రూరల్: కొత్తభల్లుగూడ పంచాయతీ సార్ణయిగూడ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఇళ్లు కోల్పోయిన పాంగి నగేష్, గోపాల్,మొత్తి, విజయ్, కుటుంబాలను అరకులోయ, హుకుంపేట మండలాల జెడ్పీటీసీ సభ్యులు శెట్టి రోషిణి, రేగం మత్యలింగం బుధవారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందే విధంగా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, శత్రుగున్, నాయకులు రాజ్‌కుమార్, రామ్మూర్తి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పనస అదుర్స్

విరగ్గాసిన పనసకాయలు



సింగర్భ గ్రామంలో విరగ్గాసిన పనస చెట్టు



మైదాన ప్రాంతానికి వాహనంలో తరలిస్తున్న పనస

జి.మాడుగుల: ఏజెన్సీ ప్రాంతంలో ఈ ఏడాది గిరిజన రైతులు పనసకాయలు ఆశించిన దిగుబడులు సాధించారు. పనసకాయలకు కొనుగోలు చేయటానికి గ్రామాల్లోను, వారపు సంతల్లో వ్యాపారులు ఎగబడుతున్నారు. గిరిజనులు తమ పంట భూముల్లోను, అటవీ ప్రాంతాల్లో ఏటా పనసచెట్లు నుంచి అధిక సంఖ్యలో లాభాలు పొందుతున్నారు. మన్యంలోని పనసకాయలు, పనసపండ్లకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో గిరిజన గ్రామాల్లోను, వారపు సంతలకు గిరిజనులు తీసుకొచ్చిన పనసకాయలు హాట్‌కేక్‌లా అమ్ముడవుతున్నాయి.

మన్యం పనసకు డిమాండ్

కొంతమంది రైతులు చింతపల్లి మండలం చిత్రలగొప్పు తదతర ప్రాంతాలకు వ్యాన్‌లతో తరలించి మైదాన వ్యాపారులకు విక్రయించి అధిక ఆదాయం పొందుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనసకాయలు సీజన్ పూర్తి కానుండడంతో వీటికి డిమాండ్‌తో పాటు ధరలు పలుకుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా కజ్జా, కొబరి, బురద పేర్లుతో పనసకాయలు పండుతున్నాయి. కజ్జా, కొబరి రకాల పనసకాయకు (10కిలోలు బరువు) రూ.100 నుంచి రూ.150 ధర పలుకుతుంది.

లక్షల్లో చెట్లు.. కోట్లల్లో ఆదాయం : కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు మండల్లాల్లో 3000హెక్టార్లు విస్తీర్ణం పనసతోటలు ఉండగా ఎకరా భూమిలో 50 నుంచి 70 చెట్లు చొప్పున 3లక్షల నుంచి 3.50లక్షల పనసచెట్లు ఉన్నట్లు అంచనా.

మండలానికి 1000 నుంచి 1500 మంది చొప్పున నియోజకవర్గంలోని సుమారు ఆరువేలకు పైగా పనస రైతులు ఉన్నారు. ఒక్కొక్క పనస రైతుకు రూ.3000 నుంచి రూ.4000లకు పైగా ఆదాయం చొప్పున సుమారు రూ.2.50 కోట్లుకు పైగా ఆదాయం లభిస్తుందని అంచనా. పనసకాయల సాగుకు ఎటువంటి వ్యవసాయ ఖర్చులు లేకుండా ప్రతీ సంవత్సరం ఆశించిన ఆదాయం వస్తుండటంతో కుటుంబ ఖర్చులు గడిచిపోతున్నాయని గిరిజన రైతులు చెబుతున్నారు.

ఆశించిన ధరలు

పనసకాయలకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ ఏడాది పనసకాయలు దిగుబడి బాగా ఉంది. కాయల సైజును బట్టి ధర పలుకుతుంది. వ్యాపారులు గ్రామాల్లోను, వారపు సంతలకు వచ్చి పనసకాయలు కొనుగోలు చేయటానికి ఎగబడుతున్నారు. దీంతో పనసరైతులకు ఆశించిన ధర వస్తుండంతో సంతోషంగా ఉంది.

– **దేముళ్లునాయుడు**, పనస రైతు, గొడ్డుబూసులు గ్రామం, జి.మాడుగుల మండలం

గడప గడపకు సంక్షేమం



పోతవరం గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

దేవీపట్నం: ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. దేవీపట్నం మండలంలో శరభవరం సచివాలయ పరిధిలో పోతవరం, చిన్నారిగండి గ్రామాల్లో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌తో కలిసి బుధవారం నిర్వహించారు.ఆయా గ్రామాల్లో ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా పథకాలు అందించన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. ఆయా గ్రామాల్లో 200 గడపలను సందర్శించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కల్గిన వారిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, నాయకులు కందుల బాబ్జి, శిరశం పెద్దబ్బాయిదొర, గారపాటి మురళీకృష్ణ, కట్టా సత్తిబాబు, గోపి, గంగాధర్, కన్నయ్య సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యతో చిన్నారుల భవిష్యత్‌కు పునాది



ఎల్లవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి తదితరులు

అడ్డతీగల: చిన్నారుల భవిష్యత్‌కి చక్కని పునాది అంగన్‌వాడీ విద్యతోనే (పూర్వ ప్రాథమిక విద్య) సాధ్యమవుతుందని అడ్డతీగల ఐసీడీఎస్ సీడీపీవో వి.దీప్తి అన్నారు. మండలంలోని ఎల్లవరంలో జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్లకార్డులతో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో దీప్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు, అనుబంధ పోషకాహారం, పిల్లల్లో పెరుగుదల పర్యవేక్షణ, అసెస్‌మెంట్ కార్డులు వంటి సేవలను వివరించారు. ప్రత్యేక స్టాల్‌ని ఏర్పాటుచేసి అందులో పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన మెటీరియల్‌ని ఉంచి అనుబంధ ఆహార పదార్థాలను ప్రదర్శించారు. బొడ్లంక ఎంపీటీసీ లోసూరి సూర్యకాంతం, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.పావని, అంగన్‌వాడీ వర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. రక్తదానం చేయాల్సిన వారు శిబిరం వద్ద ఉదయం జరిగే కార్యక్రమంలో పాల్గొవాల్సిందిగా కోరారు.

మండల సమావేశం నేడు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంఓలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. అధికారులు సమాచారంతో రావాలని సూచించారు.

పాఠశాలల్లో ఎంపీడీవో తనిఖీ



ఎ.బందవీధి పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ ఎ.బందవీధి, సింగర్భ పంచాయతీ బూరుగువీధి గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలలను బుధవారం ఎంపీడీవో చంద్రశేఖరరావు ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేసిన జగనన్న కానుక కిట్లు, హాజరు తదితరు వివరాలను ఉపాధ్యాయులను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో లాలం సీతయ్య హెచ్చరించారు. మండలంలోని బూదరాళ్ల సచివాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించి, సిబ్బందితో మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చూస్తున్నామన్నారు. దీనిపై అక్కడ పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పిస్తామన్నారు. జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహించాల్సిన ఐదు రకాల రిజిష్టర్లను విధిగా అప్‌డేట్ చేయాలన్నారు.ఎస్‌డీజీ సర్వే, ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ నాయుడు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: కాకరపాడులో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న వెంకటేశ్వర స్వామి ఆలయ పనులకు బుధవారం పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ధామచంద్రమూర్తి శర్మ, నాగలక్ష్మి దంపతులతో పాటు స్థానికులు పాల్గొన్నారు. శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో మన్యంలో ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

సీఎం జగన్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగుల కృతజ్ఞతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామదాసు తదితరులు

అరకులోయ రూరల్: కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని విశ్రాంతి ఉద్యోగ సంఘం నాయకులు, అరకు నియోజకవర్గం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిరసాని రామదాసు అన్నారు. మండలంలో చినలబుడు పంచాయతీ కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు, స్థానిక యువత తదితరులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిరసాని రామదాసు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకుని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడం చరిత్రాత్మకమన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ఎన్నికలు వచ్చినా జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. పార్టీ సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ మొశ్య, వార్డు సభ్యుడు రాజ్‌కుమార్, యూత్ సభ్యులు నరసింహరావు, డొంబు, సురేష్, యాదగిరి, రామరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం



పెదవలసలో విద్యార్థులకు జేవీకే కిట్‌లను అందజేస్తున్న సర్పంచ్ కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ ఆనంద్ తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న విద్యా కానుక కిట్‌లను సర్పంచ్ కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ ఆనంద్‌తో కలిసి బుధవారం అందజేశారు. ఆయన సర్పంచ్ కృష్ణవంతీ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి విశేష కృషి చేస్తోందన్నారు. జగనన్న విద్యా కానుక కిట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూనవరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీపీఎస్ పాఠశాల , మర్రిగూడెం జెడ్పీఎస్ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ బుధవారం పంపిణీ చేశారు. వారు మట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల మీద ఎటువంటి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యా కానుక పథకం కింద పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, షూ, బ్యాగ్స్ తదితర సామగ్రి పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిషత్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మాని అనంతలక్ష్మి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, సొసైటీ ఛైర్మన్ నోముల కొండల రావు, కూనవరం, మర్రిగూడెం సర్పంచ్‌లు హేమంత్, రామయ్య, విద్యాక మిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆస్పతి సూపరింటెండెంట్ లక్ష్మీ

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీ, వైద్యులు బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబును ఎల్లవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగ ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆస్పత్రికి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. డాక్టర్లు సుధాకర్, ప్రేమ్‌కుమార్, కౌన్సిలర్ వాసు, కుమార్, నాగదుర్గ తదితరులున్నారు.

దిశ యాప్‌పై అవగాహన



పాడేరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రంజిత్‌కుమార్



కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజారావు

సాక్షి, పాడేరు: యువతులు, మహిళలంతా దిశ యాప్‌ను తమ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, దీంతో భద్రతకు భరోసా ఏర్పడుతుందని ఎస్ఐ రంజిత్‌కుమార్ అన్నారు. స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం దిశా యాప్‌పై యువతులకు అవగాహన కల్పించారు. దిశా యాప్ నమోదుపై విస్తృత ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ నిరంతరం బాలికలు, మహిళల రక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. దిశ యాప్‌కు సమాచారం అందగానే క్షణాల్లో పోలీసుశాఖ అప్రమత్తమై రక్షణ కల్పిస్తుందన్నారు. పోలీసుశాఖ సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొయ్యూరు: దిశ యాప్‌పై అంతా అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రాజారావు సూచించారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో స్థానిక మహిళలకు దిశా యాప్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఆపద నుంచి కాపాడేందుకు ఈ యాప్ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరు దీనిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

వాహనచోదకులకు అవస్థలు



'పెట్రోల్ లేదు'అనే బోర్డుతో దర్శనమిస్తున్న లుంగాపుట్టు వద్ద పెట్రోల్ బంక్

ముంచంగిపుట్టు: లుంగాపుట్టు సమీపంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో వారం రోజుల వ్యవధిలోనే నో స్టాక్ బోర్డు దర్శనమిచ్చింది. వాహనచోదకులకు ఇబ్బందులు తప్పలేదు. మండలంలో పెట్రోల్ బంకు అందుబాటులో వచ్చింది అని సంతోషం పడిన వాహనదారులకు వారం రోజులోనే నో స్టాక్ బోరుతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి బంకులో నిత్యం పెట్రోల్ , డీజిల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



డ్రైనేజీని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నమని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రి వద్ద ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన కలిసి బుధవారం పరిశీలించారు. డ్రైనేజీలో పూడికతీత చేపట్టక మురుగునీరు పారేందుకు అవకాశం లేదని, సమస్య పరిష్కరానికి డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా పరిషత్ నిధులు రూ.4లక్షలు, పంచాయతీ నుంచి రూ.2లక్షల నిధులు డ్రైనేజీ నిర్మాణానికి కేటాయించినట్టు ఆయన తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మాంగరాజు, ఏఈ సర్ణలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని చైతన్య స్రవంతి కాలనీలోని వినాయక ఆలయంలోని గణనాథుని విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వేదపండితులు పలు పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు.

మణిఅమ్మ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అలువేణి ఇక్కడ ఆలయ నిర్మాణంతోపాటు, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు దంపతులు ఆయన సోదరుడు వసతి గృహ సంక్షేమాధికారి వినాయకరావు దంపతులు హాజరయ్యారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణాలకు మార్కింగ్ పనులు



మొండికోట గ్రామంలో రామాలయం నిర్మాణానికి మార్కింగ్ పనులు చేపడుతున్న గిరిజనులు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ మొండికోట, ఊబలగరువు గ్రామాల్లో దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో రామాలయాలు నిర్మాణానికి బుధవారం మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి సూచన మేరకు ఆయా గ్రామాల్లో రామాలయాలను నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీటీసీ పాంగి చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, చిట్టిచారి, వీఆర్పీ శ్రీహరి, నూకరాజు, రామాచారి, రాజారావు, బొంజాచారి తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్టు బాగుచేయండి



పంటకాలువ ఎడమ గట్టు దుస్థితిని అధికారులకు వివరిస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామం వద్ద వట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువ ఎడమ కాలువ గట్టును మైనర్ ఇరిగేషన్ ఇంజినీర్ హరిబాబు, ఉపాధి హామీ పథకం ఏపీవో సురేష్‌కుమార్, ఈసీ శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు పాడైన కాలువ గట్టు దుస్థితిని వివరించారు. వరదల కారణంగా కాలువగట్టు పూర్తిగా శిథిలమైందని, దీంతో ఆయకట్టు శివారు భూములకు సాగు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువగట్టును పునర్నిర్మించాలని, మొదటి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి దిగువన గల 50 ఎకరాలకు సాగునీరందేలా కొత్తగా పంటబోదెలు తవ్వించాలని, డ్రైనేజి సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.